RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 129 | ఏప్రిల్ 13, 2025 | వెల : రూ.3-00



పంటకు నష్టపరిహారం చెల్లిస్తాం..

4లో..



## ఉత్తమ ప్రెస్ క్లబ్‌గా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్..!

**వేద న్యూస్, డెస్క్:**

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదుగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అద్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య అవార్డు అందుకున్నారు.తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిగా పాల్గొన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ (ఎన్వీ రమణ) చేతుల మీదుగా ఉత్తమ ప్రెస్ క్లబ్ అవార్డు అందుకోవటం జరిగింది. తెలంగాణ రాష్ట్రం నుండి ఉత్తమ ప్రెస్ క్లబ్ గా ఎన్నికైన ఏకైక క్లబ్ "గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్" ఎంపిక కావటం గౌరవ సభ్యులకు దక్కిన గౌరవమని ఈ సందర్భంగా ఉత్తమ ప్రెస్ క్లబ్ అవార్డు అందుకున్న క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్యలు అన్నారు. ఈ అవార్డు క్రమశిక్షణ కలిగిన కార్యవర్గం నిర్వహిస్తున్న అత్యుత్తమ క్లబ్ నిర్వహణకు దక్కిన గౌరవమని చెప్పారు. అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని మీడియా అకాడమీ ఛైర్మెన్ కే శ్రీనివాసరెడ్డి , యూనియన్ నేతల సూచనలు, సీనియర్ పాత్రికేయుల సూచనలతో ముందుకు వెళ్తున్నామని ప్రకటించారు. అవార్డుకు ఎంపిక చేసి, జస్టిస్ ఎన్ వీ రమణ చేతుల మీదుగా అందించిన తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం బాధ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.



# దరఖాస్తు ప్రక్రియలో.. సమస్యలు!

## మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న దరఖాస్తుదారులు

**వేద న్యూస్, డెస్క్:**

యువత స్వయం ఉపాధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తు ప్రక్రియలో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేయడానికి రూపొందించినటువంటి ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో సర్వర్ లోపాలతో పాటు సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దరఖాస్తు సమయంలో తరచూ సర్వర్ ఎర్రర్ మెసేజ్ రావడమనేది పరిపాటిగా మారింది. దీంతో ఒక్కో దరఖాస్తు చేయడానికి కనీసం గంటకు పైగా ఎదురుచూడాల్సి వస్తోందని దీంతో ఇంటర్నెట్, మీ సేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారులు గంటల తరబడి వీచి చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. కొన్ని సార్లు అప్లికేషన్ చివరిదశకు వెళ్లిన సమయంలో సర్వర్ మొరాయిస్తుండటం, దరఖాస్తు సమర్పించిన తర్వాత అప్లికేషన్ ఫారం డౌన్లోడ్ కాకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకవేళ మళ్లీ దరఖాస్తు చేస్తే అలెడీ అప్లైడ్ అని వస్తుందంటూ దరఖాస్తుదారులు వాపోతున్నారు. కాగా ఈ నెల 14 సోమవారంతో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగియనుంది. ప్రభుత్వం మెరుగైన రాయితీతో రూ.4 లక్షల వరకు విలువైన యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించడంతో యువత ఈ పథకానికి భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకూ 13 లక్షల మందికి పైగా ఈ పథకానికి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది.





## రామయ్య మృతి పట్ల సీఎం దిగ్భ్రాంతి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి:**

'వనజీవి'గా ప్రసిద్ధి చెందిన సామాజిక వేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి రామయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రకృతి, పర్యావరణం లేనిదే మానవ మనుగడ అసాధ్యమని విశ్వసించి, ఈ సిద్ధాంతానికి తమ జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు రామయ్య అని సీఎం కొనియాడారు.సామాన్య వ్యక్తిగా మొక్కలు నాటడం ద్వారా సమాజాన్ని స్ఫూర్తివంతం చేసిన రామయ్య మరణం సమాజానికి తీరని లోటు అన్నారు. వారు చూపిన మార్గం అందరికీ ఆదర్శమని సీఎం పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన వనజీవి రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మొక్కలు నాటే ఉద్యమంలో రామయ్య వెన్నంటి నడిచిన సతీమణి జానమ్మకి, కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



## కోటి మొక్కల ప్రదాత మృతి ప్రకృతి ప్రేమికులకు తీరని లోటు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్, ఖమ్మం :**

కోటి మొక్కల ప్రదాత..పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య అకాల మృతి ప్రకృతి ప్రేమికులకు తీరని లోటు అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆయన మృతి చెందటం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణకు దశాబ్దాల కాలంగా కృషి చేశారని కొనియాడారు. కోటికి పైగా మొక్కలు నాటి పర్యావరణ ప్రేమికులకు ఎందరికో ఆయన స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఇలాంటి మహనీయుడిని కోల్పోవటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రామయ్య ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్ధించారు. ఆయన భార్య జానమ్మకు , కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- 14నెలల్లో రేవంత్ రెడ్డి సాధించిందంటూ ఏదీ లేదు
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

వరంగల్ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు మాదాసి ప్రణయ్ అధ్యక్షతన నిర్వహించిన క్రియాశీలక సభ్యుల సమావేశంలో ముఖ్యఅతిథిగా వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రైతుకు కాంగ్రెస్ పొడిచిన వెన్నుపోట్లు అన్ని ఇన్ని కావు అని మండి పడ్డారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అడుగడుగూన వంచనే,14నెలల్లో రేవంత్ రెడ్డి సాధించింది ఏమిటంటే, ఆర్భాటంగా హామీలు ఇవ్వడం ఆశాభంగానికి గురిచేయడం, రైతుల ఉసురు పోసుకోవడం ఇంతకుమించి జరిగింది, ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. నీరుగారిపోయిన హామీల వరుసలో రైతు భరోసా,పంట బోనస్, రుణమాఫీలతో పాటు పంటల బీమా పథకం కూడా చేరిందని ఏద్దేవా చేశారు. గ్రామ పంచాయతీలకు ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రం నిధులిస్తే ఆ నిధులనుకూడా ముఖ్యమంత్రి లాక్కున్నాడని ఆరోపించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధి దీపాలు ఇంకా ఎన్నో గ్రామాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే తామే ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి బీజేపీతోనే

మిగతా 4వ పేజీలో..

## పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఊహించని స్పందన కనబడుతుందని అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం రోజున వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 12వ డివిజన్ దేశాయిపేట లోని రేషన్ కార్డ్ లబ్ధిదారుడు పూర్ణచందర్ ఇంటికి భోజనానికి ఆహ్వానించగా వారి ఇంటికి మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, జి డబ్ల్యుఎంసీ కమిషనర్ అశ్వినీతానాజీ వాకాడే పాల్గొన్నారు. కాగా, మంత్రి కొండా సురేఖ రాకతో వారి కుటుంబం సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ ఇంటికి ఏ రాజకీయ నాయకుడు ఇప్పటివరకు రాలేదని మంత్రి కొండా సురేఖ రావడంతో నిజమైన పండగ వచ్చిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వారి కుటుంబంతో సహపంక్తి భోజనం చేశారు. రేషన్ కార్డులో వచ్చిన సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వంట చేసి వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల కష్టాలు తీర్చే పార్టీ అని ప్రభుత్వం ఇచ్చే సన్న బియ్యంతో భోజనం చేయడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ధనిక వర్గాలు తినే సన్న బియ్యం నిరుపేద గడపల్లో కూడా వండడం గొప్ప విషయమని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే లబ్ధిదారులు అమ్ముకునే పరిస్థితి ఉండేదని ఇప్పుడు రేషన్ షాప్ లో సన్న బియ్యం కోసం పోటీ పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతవరకు సన్న బియ్యం పంపిణీ కొనసాగుతుందని సన్న బియ్యం పంపిణీ దేశ చరిత్రలో వెలిగిపోతుందని తెలిపారు. ప్రజలను ఆదుకుంటూ సన్న బియ్యం, గృహ జ్యోతి, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం ,500 గ్యాస్ సిలిండర్ లాంటి పథకాల ద్వారా ఒక్కో రేషన్ కార్డ్ లబ్ధిదారులకు నెలకు రూ.2,500 ఆదా జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## ఆర్ఎంపీ, పీఎంపీలు డాక్టర్లు కారు..!

- నకిలీ వైద్యుడిపై కేసు నమోదు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ జిల్లా కాశిబుగ్గలో నకిలీ వైద్యుడు సుహానా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు జి.సదానందంపై కేసు నమోదు అయ్యింది. నకిలీ వైద్యుడు..ఆర్ఎంపి/పిఎంపి అయిన గుర్రం సదానందం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నారనే సమాచారం పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీలు నిర్వహించింది. అతను ఇష్టరీతినా ఆశాస్త్రీయ

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 13, 2025

# ఫోటోగ్రాఫర్లపై దాడి హేయమైన చర్య

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



నల్గొండ పట్టణంలో గీతాంజలి అపార్ట్మెంట్ లో మణికంఠ కలర్ ల్యాబ్ నిర్వహిస్తున్న గద్దపాటి సురేష్ ను గత రాత్రి గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా కత్తితో దాడి చేసి హతమార్చడం హేయమైన చర్య అని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సూర్యాపేట పట్టణంలోని పట్టణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సురేష్ మరణానికి సంఘీభావంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ ఎవరికి ఎలాంటి హాని చేయని ఫోటోగ్రాఫర్ల జీవితాలతో ఎవరు ఆడుకోకూడదని సురేష్ కుటుంబానికి న్యాయం చేసి వారి మరణానికి కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలని సూర్యాపేట జిల్లా పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణంలో పలు ల్యాబ్ లు ఫోటో స్టూడియోలు స్వచ్ఛందంగా బంధు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సూర్యపేట పట్టణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొక్కుల శేఖర్, ప్రధాన కార్యదర్శి కూకుంట్ల శంకర్, కోశాధికారి రాపర్తి మహేష్, యూనియన్ నాయకులు ఆర్ఆర్ ల్యాబ్ గిరి, ఆర్ఆర్ ల్యాబ్ శేఖర్, సిద్ధి శ్రీకాంత్, పద్మాలయ శ్రీనివాస్, మిక్సింగ్ నజీర్,మిక్సింగ్ పాషా, దుర్గారావు, బోస్, వరుణ్ ల్యాబ్ స్టాప్, రెడ్డిన్ ల్యాబ్ స్టాప్, సంజీవ ల్యాబ్, మిక్సింగ్ శ్రీకాంత్, న్యూ అంజలి శేఖర్, హనుమంతు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో సోనోవిజన్ షోరూం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



సూర్యాపేట జిల్లా ప్రజలకు అందుబాటులో కుడకుడ రోడ్డులో నూతనంగా 72 వ సోనోవిజన్ షోరూంను సోనోవిజన్ ఫౌండర్ అండ్ చైర్మన్ పొట్లూరి జనార్ధన మూర్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కర మూర్తి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోనోవిజన్ షోరూం ప్రారంభం సందర్భంగా అన్ని కంపెనీల ఏసీలు, ఎయిర్ కూలర్స్, రిఫ్రిజిరేటర్స్, ఎల్ఈడి టీవీలు,మొబైల్స్, లాప్ టాప్స్, వాషింగ్ మిషన్స్,కిచెన్ అప్లయెన్సెస్ ను తక్కువ ధరలలో అందించనున్నట్లు తెలిపారు. జీరో ఫైనాన్స్ తో పాటు ఆకర్షణీయమైన క్యాష్ బ్యాక్ ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపారు. క్వాలిటీ గల ప్రొడక్ట్స్ ను అందరి కంటే తక్కువ ధరలలో ఉత్తమమైన క్యాష్ బ్యాక్ ఆఫర్లు తమ షోరూమ్ నందు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నమ్మకమైన ఆఫ్టర్ సేల్స్ సర్వీస్ ను అందిస్తున్నామని అన్నారు. తమ షోరూంలో లభించే ఎలక్ట్రానిక్ వస్తు సేవలను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, షోరూం భవన యజమాని భావ్ సింగ్, అన్ని ప్రముఖ కంపెనీల మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

## – రైతును రాజు చేయడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యం – ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వేద న్యూస్, వర్ధన్నపేట :**

వర్ధన్నపేట మండల పరిధిలోని దమ్మన్నపేట గ్రామం నందు పౌర్ణమి గ్రామైక్యా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని డిఆర్డివో కౌసల్యతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలిపారు.రైతును రాజు చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ గారు తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. ఇక భారతదేశానికి ఆనాడు రైతులకు లక్ష రుణమాఫీ,నేడు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదే అని, దేశానికే అన్నం పెట్టే ధాన్యగారంగా తెలంగాణ మారుతుందని తెలిపారు. ఈ సన్న బియ్యం తో పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని గొప్ప సంకల్పంతో రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపడుతున్న గొప్ప ప్రభుత్వం మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్నారు. ప్రతి దానం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవ్వరు దళారులను నమ్మి మోసపోవద్దు అని సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని



సిబ్బందిని ఆదేశించారు. వాతావరణంలో జరుగుతున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు, కొనుగోలు కేంద్రాలు మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్రావు,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు ఏపీ కుమార్ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు ఎంపీడీవో, ఎంఆర్ఓ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు

# శంకుస్థాపన చేసిన మంత్రి



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ తూర్పు నియోజకవర్గ బల్దియా పరిధిలోని 19వ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో బల్దియా ఆధ్వర్యంలో రూ.33 లక్షల స్పెషల్ డెవలప్మెంట్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు, పైపులైన్, డ్రైన్ నిర్మాణం తో పాటు 24 వ డివిజన్ లోని షేర్ పుర పారక్ మేహల్లా లో రూ.20 స్పెషల్ డెవలప్మెంట్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు, డ్రైన్స్ నిర్మాణానికి శనివారం రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే లతో పాటు కార్పొరేటర్లు ఓని స్వర్ణలత భాస్కర్, రమా తేజస్వి శిరీష్ , చింతాకుల అనిల్ కుమార్, స్థానిక నాయకులు మబ్బు ప్రవీణ్, మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ స్వామి వారి కల్యాణము



**వేద న్యూస్, చిల్పూర్ :**

శ్రీశ్రీశ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ స్వామి వారి కల్యాణము వేదమంత్రోచరణలతో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ ఈ కళ్యాణానికి వివిధ గ్రామాల నుండి పట్టణాల నుంచి అధిక భక్తులు పాల్గొన్నారు. దేవాలయ చైర్మన్ శ్రీమన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న, ధర్మకర్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కాగా అన్నప్రసాద దాతలుగా మండల సహెూదర్ రెడ్డి- మౌనిక,తోట కిరణ్-కీర్తి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మోహన్, ముఖ్య అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్.పీ గ్యాస్ సౌజన్యంతో చలివేంద్రం ఏర్పాటు

**వేద న్యూస్, సిర్పూర్ టీ :**




వేసవిలో ఎండ వేడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్.పీ గ్యాస్) తమ సామాజిక బాధ్యతగా సిర్పూర్ టీ మండలంలో నిరుపేదలు మరియు వినియోగదరుల కోసం ఒక చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ చలివేంద్రాన్ని స్థానిక ఎస్ ఐ కమలాకర్ మరియు హెచ్.పీ గ్యాస్ డీలర్, కుర్షిద్ హుసేన్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ కమలాకర్ మాట్లాడుతూ "హెచ్.పీ గ్యాస్ ఈ వేసవి కాలంలో పేద ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. దీని ద్వారా ఎంతో మందికి చల్లని నీరు దహని తీరుస్తుంది. అని హెచ్.పీ గ్యాస్కు మా ధన్యవాదాలు" అని అన్నారు. హెచ్.పీ గ్యాస్ డీలర్ కుర్షిద్ హుస్సేన్ మాట్లాడుతూ, "మేము సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వేసవిలా వేడి ఎండలు ఎక్కువ ఉన్న కారణంగా ఎవరూ ఇబ్బంది పడకూడదనేదే తమ లక్ష్యమని తెలిపారు.

## అవయవ దానంపై ప్రజల్లో

# అవగాహన పెంచాలి



**వేద న్యూస్,**

**ఎన్టీపీసీ జ్యోతినగర్ :**

అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి అన్నారు. ఇటీవల లింగాపూర్ గ్రామానికి చెందిన తోట రాజయ్య మరణించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అతన్ని కళ్ళను సదాశయ ఫౌండేషన్ వారికి దానం చేశారు. శనివారం సదాశయ ఫౌండేషన్ వారు అభినందన సభ ఏర్పాటు చేసి ఆ కుటుంబానికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు లింగమూర్తి,లక్ష్మీ నారాయణ మరియు వారి కుటుంబ సభ్యులు తోట భాగ్య కుమారులు తోట సాగర్ - నిరోష అన్నతమ్ముళ్ళు తోట రవి,చిన్నయ్య,నల్లపు ప్రభాకర్ తోట చంద్రయ్య,తోట భ్యాగ్యమ్మ,తోట కర్ణ,తోట సతీష్,తోట లహరి తదితరులు పాల్గొన్నారు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను

# ప్రారంభించిన ప్రభుత్వ విప్

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలపూర్ మండల కేంద్రంలో ఐకెపి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధ్యానం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు.

## రాజీవ్ యువవికాస్ పథకం

# దరఖాస్తు గడువు పొడగించాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ అధ్యక్షులు నాలి నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ రాజీవ్ యువ వికాస్ పథకం ఏప్రిల్ 14 రోజున గడువు ముగిసి పోతుంది అని దీనితో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఆన్లైన్ ద్వారా కావడం వల్ల సరిగ్గా ఇంటర్నెట్ పని చేయకపోవడం తహసిల్దార్ ఆఫీస్ లలో సర్టిఫికెట్లు సరైన సమయానికి అందకపోవడం జరిగిందని అన్నారు.అదే విధంగా మధ్యలో కొన్ని గవర్నమెంట్ సెలవులు రావడం వల్ల నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు.కావున తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకం గడువును మరో 10 రోజులు పెంచాలని పత్రిక ముఖంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గం బీసీ ఇంచార్జ్ కుందారపు రమేష్,మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జ్ పుట్టల దినేష్,ఉపాధ్యక్షులు గాలిబ్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యుజే నూతన కమిటీకి సన్మానం



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

సమాజంలోని నిరుపేదల గొంతుక జర్నలిస్టులు అని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ శనివారం అభిప్రాయపడ్డారు. అవినీతి, పేదరికాన్ని నిర్మూలించడానికి కృషి చేయాలని ఆమె జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. శ్రీ బాలానగర్ వెంకటేశ్వర స్వామి ఆలయ సమావేశ మందిరంలో ఐజెయు అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె) వరంగల్ జిల్లా కొత్తగా ఎన్నికైన కమిటీకి అభినందన సమావేశంలో ఆమె మాట్లాడారు. జర్నలిస్టులు పేద ప్రజల సమస్యలను ఎత్తిచూపి, వాటిని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి పరుష్కారం చూపితే బిపిఎల్ మరియు పేద ప్రజలు తమ సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోరు అన్నారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీరామ్ రామచందర్, కార్యదర్శి ఎం.డి. ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్స్ జె స్వామి, కె వేంకటేశ్వర్లు సంయుక్త కార్యదర్శులు రాజు మరియు సతీష్‌లను పూజారులు పరాశరం శ్రీనివాసాచార్యులు మరియు సుదర్శనాచార్యులు ఆశీర్వదించారు.

# సన్న బియ్యంతో లబ్ధిదారుల ముఖాల్లో సంతోషం



వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరుపేదల కడుపు నింపేందుకు తీసుకొచ్చిన సన్నబియ్యం పంపిణీ విజయవంతం అవుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేయాలనే కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడ మండలం దొండవారి గూడెం గ్రామం మరియు లక్ష్మి పురం గ్రామంలో మరియు మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామాలలో సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సమయంలో సన్న బియ్యం లబ్ధిదారులను సన్నబియ్యం ఎలా ఉంది అని అడగడంతో గతంలో దొడ్డు బియ్యం తినలేకపోయేవాళ్ళం కానీ ఇప్పుడు సన్నబియ్యంతో కడుపు నిండా తింటున్నామన్నారు. అలాగే నెలకు 15 వందల నుంచి 2 వేల రూపాయలు వరకు ప్రతీ నెల ఆదా అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేసారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి

**వేద న్యూస్, స్టేషన్ ఘనపూర్ :**



హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సీఆర్ఆర్, సిడిపి, నిధుల ద్వారా చేపట్టిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన వేలేరు, చిల్పూర్ మండలాలలో ఇంటిగ్రేటెడ్ మండల్ ఆఫీస్ కాంప్లెక్స్ మంజూరు ఇవ్వాలని అలాగే జఫర్ గడ్ మండలంలో ఎంపీడివో కార్యాలయం శిథిలావస్థలో ఉందని కావున నూతన ఎంపీడివో కార్యాలయం మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ చాలా గ్రామ పాత పైప్ లైన్ కే కనెక్ట్ చేశారాని అవి తగిన సామర్థ్యం లేక పగిలి పోతున్నాయని అలాగే వాటర్ ట్యాంక్ లు నిర్వహణ లేక ట్యాంక్ లు క్లిన్ చేయడానికి నిచ్చెనలు కూడా లేవని తెలిపారు. వెంటనే ట్యాంక్ ల నిర్వహణకు నిధులు కటాయించి రిపేర్లు చేయించాలని అన్నారు. గ్రామాలలో అవసరానికి సరిపడా నీరు రావడం లేదని గ్రామాలలో అవసరం ఉన్న చోట బోర్లు వేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. త్రాగు నీటి సమస్యలు తలేత్తకుండా ఇప్పుడే రిజర్వాయర్లను నింపాలని తెలిపారు. పంటల సీజన్ కూడా అయిపోయినందున వెంటనే పంపింగ్ స్టార్ట్ చేసి రిజర్వాయర్లను నీటి నిలువలు ఉండే విధంగా చూడాలని కోరారు.

# రైతులు ఒకే పంటపై ఆధారపడొద్దు

**– నల్లగొండ జిల్లాను వ్యవసాయ హబ్ గా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి – జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.**

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :

నల్గొండ జిల్లాను వ్యవసాయ హబ్ గా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఇక్కడి వాతావరణం, నీటి వసతులు, నూతన పంటల సాగు ,వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని నల్గొండ ను వ్యవసాయ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, త్రిపురారం మండలం, కంప సాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఫాక్స్ నట్ మఖాన ప్రయోగాత్మక సాగును ప్రారంభించారు. రైతులు బాగుపడేందుకు ఒకే పంట పై ఆధారపడకుండా పంట మార్పిడి దిశగా వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఒకే పంటను సాగు చేయడం వల్ల కరువు లేదా తెగులు వంటివి సోకినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతారని, అలా నష్టపోకుండా పంటల మార్పిడి పాటించినట్లయితే ఎక్కువ లాభాలు వచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సాధారణ పంటలు కాకుండా కొత్తరకం పంటలు సాగు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా నుండి 4 వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందాన్ని గత మార్చిలో బీహార్ రాష్ట్రంలోని దర్భంగ మఖాన స్టేషన్ పంపించడం జరిగిందని, ఈ బృందం అక్కడ మఖాన సాగు గురించి విత్తనం మొదలుకొని పంట కోత వరకు అన్ని విషయాలను అధ్యయనం చేసి ఇక్కడి రైతులతో వారి అనుభవాలను పంచుకున్నారని తెలిపారు. నల్గొండ జిల్లాలో మఖాన సాగులో భాగంగా ప్రయోగాత్మకంగా కంప సాగర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో ముందుగా ఒక ఎకరం విస్తీర్ణంలో మఖాన సాగును చేసేందుకు నిర్ణయించడం జరిగిందని, ఇందుకు 10 కిలోల విత్తనం వాడడం జరుగుతున్నదని, రెండు, మూడు నెలల్లో ఈ విత్తనం ఒక ఎకరం క్షేత్రానికి తరలించనున్నట్లు తెలిపారు. పూర్తి సాంకేతికంగా పండించనున్న మఖాన సాగులో భాగంగా కంపసాగర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రం తో పాటు, కట్టంగూర్ రైతు ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో 3 ఎకరాలలో, నకిరేకల్ నియోజకవర్గంలో 2 ఎకరాలు, కొండమల్లేపల్లి లో 4 ఎకరాలలో మఖాన సాగును చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

వ్యవసాయంలో వస్తున్న నూతన పద్ధతులపై రైతులకి కంప సాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం తో పాటు, కొండమల్లపల్లిలో ఉన్న కెవికె క్షేత్రస్థాయి ప్రదర్శనలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాయని , జిల్లా యంత్రాంగం తరపున ఇకపై క్షేత్రస్థాయిలో సందర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్గానిక్ వ్యవసాయంపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నందున ఆర్గానిక్ వ్యవసాయంపై అవకాశాలు, ముఖ్యంగా కూరగాయలు, బత్తాయి,నిమ్మ వంటివి పండించేందుకు తక్కువ ఎరువుల వినియోగం ఎక్కువ దిగుబడులు సాధించేందుకు రైతులను క్షేత్రస్థాయి అధ్యాయానికి పంపిస్తామన్నారు.




ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ శాసనసభ్యులు, కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల కేంద్రం అధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం ,

మహిళల సాధికారత పట్ల మక్కువ చూపుతున్న జిల్లా కలెక్టర్ వ్యవసాయంలో కొత్త పద్ధతులు తేవడంతో పాటు, మఖాన సాగుకు బీహార్ ఉత్తరప్రదేశ్ కు జిల్లా శాస్త్రవేత్తలను పంపించి ఇక్కడ పండించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. కంప సాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్రాథమికంగా మఖాన సాగును ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు వరి పైన ఆధారపడకుండా, బహుళ పంటలు పండించాలని ,మన ప్రాంతం తో పాటు, దేశంలో ఉన్న వివిధ రకాల పంటలను ఆహ్వానించాలని, కొత్త పంటలు, వంగడాలను పండించాలన్నారు. ముఖ్యంగా మఖానాకు సంబంధించి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, 250 గ్రాముల పాకెట్ 300 రూపాయలకు అమ్ముతున్నారని, ఈ మఖాన షుగర్ పేషెంట్లకు బాగా ఉపయోగపడుతుందని, ఆహారపు అలవాట్ల వల్ల షుగర్ ను తగ్గించుకోవచ్చని, ముఖ్యంగా మనం ఆచరించే పద్ధతులు, ఆహారపు అలవాట్ల వల్ల వయసును పెంచుకునే ఆస్కారం మనిషికీ ఉందని, కట్టంగూరు రైతు ఉత్పత్తి కేంద్రం ద్వారా 3 ఎకరాలలో మఖాన సాగుకు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రవణ్, ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి, కంప సాగర్ హెడ్ లింగయ్య, వ్యవసాయ శాస్త్రవేత్తలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కంప సాగర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో పంటలను పరిశీలించారు .అంతేకాక మొక్కలు నాటి, మఖాన సాగు విత్తనాలను వ్యవసాయ క్షేత్రంలో చల్లారు.

# సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, శాయంపేట:**



పేద, ధనిక అనే తేడా లేకుండా ఉండేలానే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని భూపాల్ పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం శాయంపేట గ్రామంలోని మారేపల్లి సమ్మయ్య లబ్ధిదారుని ఇంట్లో అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గతంలొ రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలా మంది లబ్ధిదారులు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించే వారన్నారు. తినేందుకు సన్న బియ్యం మార్కెట్లో కొనుక్కొని తినేవారు అన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్న పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్న బియ్యం ప్రజా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, డిడి ప్రభావతి, సీఐ రంజిత్ రావు, ఎస్సై పరమేష్, మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజర్ నెంబర్ బాసాని చంద్రప్రకాష్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, మాజీ జెడ్పిటిసి చల్ల చక్రపాణి, నాయకులు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, మారపల్లి కటయ్య, వరదరాజు, కొమ్ముల భాస్కర్, మార్కండేయ, ఐ ఎన్ టి యు సి అధ్యక్షుడు మారపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సురేష్ అనే వ్యక్తి దారుణ హత్య..!

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్లగొండ పట్టణంలో అతి కిరాతకంగా సురేష్ అనే వ్యక్తిని నరికి హత్య చేసిన గుర్తుతెలియని దుండగులు.టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు కూతవేటు ధైర్యం లోనే ఈ మర్డర్ జరిగింది. వివరాల్లోకెళ్తే నల్గొండ పట్టణం రామగిరి ప్రాంతంలో గీతాంజలి కాంప్లెక్స్ లో మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్ ను నకిరేకల్ కు చెందిన గద్దపాటి సురేష్ గత ఐదు సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతుంది. సురేష్(37 సం)ను గుర్తు తెలియని ఇద్దరు దుండగులు మాస్కులతో వచ్చి వేట కత్తులతో దాడి చేయడం జరిగిందనీ స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న టూ టౌన్ పోలీసులు అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారు. కుటుంబ కలహాలు లేదా పాత కక్షలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.సంఘటన స్థలానికి చేరుకున్న డిఎస్పి శివరాం రెడ్డి అక్కడ ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించడం జరిగింది.చుట్టుపక్కల ఉన్న సిసి ఫుటేజ్ లను మరియు సురేష్ యొక్క కాల్ డేటాను ను పరిశీలించి కేసు దర్యాప్తును ముమ్మరం చేస్తామని తెలపడం జరిగింది.

# కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రతి ఒక్క పథకం పేదల కోసమే

**– నిరుపేదల ఇండ్లలో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి సీతక్క**

వేద న్యూస్, ములుగు ప్రతినిధి :

తాడ్వాయి మండలం మొండ్యాలతోగు గిరిజన గూడెంలో ములుగు జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో గూడెం వాసులతో సహకపంక్తి భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ , గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విచ్చేసి సహపంక్తి భోజన కార్యక్రమంలో ప్రజల మధ్యన కూర్చుని భోజనం చేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. పేదోడి కడుపు నింపడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారని, ప్రతి ఒక్క పథకం పేదల కోసమే, వారి అభ్యున్నతియే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఎర్రబస్సులో ఉచిత ప్రయాణ పథకం మొదలు పెట్టీ సంవత్సరంన్నర అయిపోయింది అని అన్నారు. అందుకే పేదల కోసం ఏర్పాటు చేసిన



అత్యున్నత పథకాలు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకి వడ్డీ లేని రుణాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, మహిళల కోసం టీ స్టాళ్లు, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ఇలా ఎన్నో పథకాలు అమలు చేస్తూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం పాటు పడుతున్న వ్యక్తి రేవంత్ రెడ్డిని అన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు కడుపు నిండా అన్నం తినాలనే కాంక్షతోనే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ఈ నెల నుండి ప్రారంభించడం జరిగింది అని, రాష్ట్రం మొత్తం మీద తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేష్, డీఎస్పీ రవీందర్, మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 13, 2025



## నేషనల్ హైవే భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

**వేద న్యూస్, వరంగల్ :**

జిల్లాలో జాతీయ రహదారి 163జి భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలోని సంగెం, పర్వతగిరి, గీసుగొండ, నెక్కొండ మండలాల్లోని గ్రామాల్లో 38.20 కిలో మీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై ఆదనవు సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం హెచ్ ఏ ఐ. దివ్య, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యవేక్షకులు శ్రీకాంత్, జాతీయ రహదారుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేత

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. సురేఖ మండల సమాఖ్య శాయంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 842 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.1,59,60,000 విలువ కలిగిన జంబో చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించేందుకు ప్రజా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో జాప్యం సరికాదు

- బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో జాప్యం సరికాదని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. పేదలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన రిలీజ్ చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో అధికార పార్టీ నేతలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఆయా గ్రామాల్లోని అధికార పార్టీ లీడర్లకు సంబంధిత చెక్కులు అందజేయడంతో.. అవి బాధితులకు చేరడంలో కాలయాపన జరుగుతోందని వివరించారు. బాధితులు లేదా లబ్ధిదారులకు ఆయా స్కీముల చెక్కులు సకాలంలో అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని కోరారు.

## ఆర్ఎంపీ, పీఎంపీలు డాక్టర్లు కారు..!

**మొదటి పేజీ తరువాయి**

పద్ధతుల్లో హై డోస్ ఆంటీ బయోటిక్స్, స్టేరాయిడ్ ఇంజెక్షన్స్ రోగులకు ఇవ్వడంతో పాటు ఫార్మసీ లైసెన్స్ లేకుండా పెద్ద మొత్తంలో మందులు నిల్వ ఉంచారని తనిఖీ చేసిన అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇంతేజర్‌గంజ్ పోలీస్ స్టేషన్ లో అధికారికంగా రిజిస్టర్ డా. డి.లాలయ్య కుమార్, చైర్మన్ డా. కె. మహేష్ కుమార్ లు ఫిర్యాదుల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎన్ఎంసీ చట్టం సెక్షన్లు 34, 54 మరియు టీఎస్ఎంపీఆర్ చట్టం సెక్షన్ 22 ప్రకారం ఈ కేసు నమోదు కాగా చట్టం ప్రకారం, నకిలీ వైద్యుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష లేదా రూ.5 లక్షల వరకు జరిమానా పడే అవకాశం ఉంటుంది.

ఆర్ఎంపీ, పీఎంపీలు డాక్టర్లు కారు

ఈ ఘటనపై స్పందించిన పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా. నరేష్ కుమార్ మాట్లాడుతూ “ఆర్ఎంపీలు, పీఎంపీలు నిబంధనల ప్రకారం డాక్టర్లు కారు. వీరు చిన్నపాటి ప్రాథమిక చికిత్స వరకు పరిమితం కావాల్సినవారే. కానీ వైద్య విద్య లేని వారు ఇష్టరీతినా మందులు ఇవ్వడం, సర్జరీలు చేయడం, అబార్షన్లు ప్రోత్సహించడం వంటివి శ్రేయస్కరం కాదు. ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆటాడటమే.” అని పేర్కొన్నారు. అధికారిక డిగ్రీలు కలిగిన, ప్రభుత్వ అనుమతులు పొందిన వైద్యులనే సంప్రదించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనధికార నకిలీ వైద్యుల సేవలు తీసుకోవడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. నకిలీ వైద్యులపై ఫిర్యాదు కోసం వాట్సాప్ ద్వారా 91543 82727 నెంబర్ లేదా ఇమెయిల్ : antiquackerytsmc@onlinetsmc.in సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

# పంటకు నష్టపరిహారం చెల్లిస్తాం..

- ఇండ్ల నిర్వాసితులకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తాం
- రాష్ట్ర మంత్రి సీతక్క

**వేద న్యూస్, ములుగు ప్రతినిధి:**



వడగళ్ల వాన అకాల వర్షం కారణంగా పలు రకాల పంటలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వర్షాల కారణంగా ఇండ్లు కూలిపోయిన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క )అన్నారు. శనివారం గోవిందరావుపేట మండలం దుంపలగూడెం గ్రామంలో కలెక్టర్ దివాకర్ టిఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ లతో రైతులు, వర్ష బాధిత కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల పలు మండలాల్లో అకాల వర్షం కారణంగా నోటి కాడికి వచ్చిన పంట దెబ్బ తినడం బాధాకరమని, ఇదే సందర్భంలో పలు రకాల ఇండ్లు కూలిపోవడం జరిగిందని అన్నారు. వర్షం అనంతరం జిల్లా యంత్రాంగం నష్టపోయిన పంట వివరాలు సేకరణ, కూలిపోయిన ఇండ్ల వివరాల సేకరణలో నిమగ్నమైందని పూర్తి వివరాల సేకరణ అనంతరం నష్టపరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు, బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వడానికే ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ నుండి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటానని సీతక్క హామీ ఇచ్చారు.

అనంతరం బాధిత కుటుంబాలకు తక్షణసాయంగా వంట సామాగ్రి తో పాటు 2 వేల 5 వందల రూపాయల నగదు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ఆర్డిఓ వెంకటేష్, మండల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా సాగిన హనుమాన్ జయంతి ర్యాలీ

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**




హనుమాన్ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వరంగల్ మహానగరంలో నిర్వహించిన వీర హనుమాన్ విజయయాత్ర శోభాయమానంగా సాగింది. ఈ శోభాయాత్రను పురస్కరించుకుని ఓరుగల్లు నగర వీధులన్ని కాషాయ కలను సంత రించుకున్నాయి. హనుమాన్ చాలీసా పారాయణంతో శోభాయాత్రను ప్రారంభించగా హిందూ యువత పెద్ద ఎత్తున పాల్గొని జై శ్రీరామ్.. జై హనుమాన్.. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. వీహెచ్పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం చైత్ర పౌర్ణమి రోజున వరంగల్ రంగశాయిపేట నుండి యాత్రను ప్రారంభించి హనుమకొండ పద్మాక్షి దేవాలయం సమీపంలోని హనుమద్గిరి వరకు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ చాముండేశ్వరీ అనుగ్రహ పీఠాధిపతి శ్రీ కృష్ణ చాముండేశ్వర మహర్షి స్వామి హజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, వీహెచ్పీ, హిందూ సంఘాల నేతలు మాట్లాడుతూ సనాతన భారతీయ జీవన విధానంలో వసుదైన కుటుంబం భావనతో మన ధర్మం కొనసాగుతుందని విశ్వజన సంక్షేమం, విశ్వహిందూ లక్ష్యం అనే నినాదంతో పరిషత్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ధైర్యం శక్తి సామర్థ్యాలకు హనుమంతుడు ప్రతీక అని, తన బలపరాక్రమాలతో రామకార్యాన్ని సులభతరం చేసిన హనుమాన్ శక్తి యుక్తులు అపారమైనవని అన్నారు. నేటి రోజుల్లో హిందూ ధర్మంపై పెచ్చుమీరుతున్న విధర్మీయుల అకృత్యాలను ఎదుర్కోవడానికి హిందూ సమాజం దృఢంగా ఉండాలని, హిందూ సమాజం సంరక్షణ కోసం ప్రతీ హిందువు హనుమంతుడి నుండి స్ఫూర్తిని పొందాలని పిలుపునిచ్చారు. విధర్మీయులు, విదేశీ దురాక్రమణ దారుల దాడుల నుండి మన పూర్వీకులు సనాతన ధర్మాన్ని కాపాడుకుంటూ వస్తున్నారని, మతం మారడం కంటే ప్రాణాలు వదిలేయడమే మంచిదంటూ ప్రాణత్యాగాలకు సిద్ధపడిన చత్రపతి శంబాజీ మహరాజ్ లాంటి వారిని హిందు యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సనాతన ధర్మం, హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయని, ఆలయాల రక్షణ కోసం ప్రతీ ఒక్కరూ ఎల్లవేళలా సిద్దంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీ జిల్లా కార్యదర్శి వెలగందుల రాజు, బజరంగ్దళ్ జిల్లా సంయోజక్ కొల్లూరి ఆదిత్య సాయి, పరిషత్ ఉపాధ్యక్షులు నేలకొండ భాస్కర్ రావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందాల చందర్ బాబు, సహ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్ కుమార్, బజరంగ్దళ్ విభాగ్ సంయోజక్ ఆల్లకట్ల సాయి, సహ సంయోజక్ బండి రోహిత్, జిల్లా బజరంగ్ దళ్ సహసంయోజక్ సుతారి సాయి, జిల్లా సహ కార్యదర్శులు సందీప్ రెడ్డి, నాగుల ప్రసాద్, కోశాధికారి స్వామినాథన్, జిల్లా గోరక్ష బాధ్యులు నంగునూరు నాగరాజు, ప్రఖండ కార్యదర్శి తాళ్లపల్లి రమేష్, వరంగల్ ప్రఖండ అధ్యక్షులు బొమ్మ నాగరాజు, కాశిబుగ్గ అధ్యక్షులు అచ్చ రవికుమార్, హనుమకొండ ప్రకండ అధ్యక్షులు సునంద్, విశ్వవిద్యాల నగర అధ్యక్షులు ఓం కుమార్, కాజీపేట ప్రఖండ సంయోజక్ దుప్పెల్లి అరవింద్, రామానుజన్ది తదితరులు పాల్గొన్నారు.

# సీఎంని విమర్శించే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదు..

**వేద న్యూస్,వర్ధన్నపేట :**



వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చిన సవాల్ ను స్వీకరిస్తూ వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ముందుగా ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేసి ఏప్రిల్ 27న వరంగల్‌లో సభను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉద్యమంలో ఉన్నప్పుడు ఆస్తుల విలువ ఎంత 10 సంవత్సరాల పాలన తర్వాత ఆస్తుల విలువ ఎంతో ప్రజలందరూ గమనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తల్లి సోనియాగాంధీ దయ వల్ల అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కుతోటి ఉద్యమాలను అడ్డుపెట్టుకొని దొడ్డి దారిన 10 సంవత్సరాలు సీఎంగా కెసిఆర్ అయ్యారని విమర్శించారు. మళ్లీ మాయమాటలకు మోసపోవడానికి సిద్ధంగా తెలంగాణ ప్రజలు లేరన్నారు. పేద ప్రజలకు పథకాలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద మధ్యతరగతి కుటుంబాలకు దగ్గరవుతుందని అలాంటి నాయకుడి పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సబబు కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కూడా లేదన్నారు. దిగజారుడు మాటలుమాట్లాడి ప్రజలను మభ్యపెడుతూ ప్రజల్లో మనగాడ కనుమరుగైతుందని బాధతో మా సీఎం మీద ఏది పడితే అది పిచ్చిపిచ్చి కూతలు కూస్తున్నారు ఖబడ్దార్ మీ స్థాయికి మేము సరిపోతాం మీరు ఇచ్చే సవాల్‌ని మేము స్వీకరిస్తున్నాము స్థానిక సంస్థల్లో బిఆర్ఎస్‌కి పార్లమెంట్ ఎలక్షన్ లో పట్టిన గతే రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అదే గతి పడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్ కుమార్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజిరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వనజీవి మరణం.. రాష్ట్రానికే కాదు.. దేశానికే లోటు

**వేద న్యూస్, ఖమ్మం:**




తన జీవితం మొత్తం పర్యావరణ పరిరక్షణ కోసం తపిస్తూ..కోటి మొక్కలు నాటిన వనజీవి రామయ్య వంటి గొప్ప పర్యావరణ ప్రేమికుడిని కోల్పోవడం చాలా బాధాకరమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి రెడ్డిపల్లిలో రామయ్య మృతదేహం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ వనజీవి రామయ్య తపనంతా.. మొక్కలు పెంచడం, సంరక్షించడమేనని.. కోటికి పైగా మొక్కలు నాటిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మరణించేంత వరకు వన సంరక్షణే ధ్యేయంగా శ్రమించి.. భావితరాలకు స్ఫూర్తి నింపారని అన్నారు. అలాంటి మహానుభావుడి మృతి రాష్ట్రానికే కాదు..యావత్తు దేశానికే లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. రామయ్య మరణ వార్త విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్, జెసిలకు తెలిపి ఏర్పాట్లు పర్యవేక్షించాల్సిందిగా సూచించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాధ బాబు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మారెమ్మ దేవస్థానం చైర్మన్ టీ. వీరా రెడ్డి, కానుగుల రాధాకృష్ణ, పంతులు నాయక్, రామ్మూర్తి నాయక్, లింగాల రవికుమార్, కార్పొరేటర్ నిరంజన్, సీపీఐ నేత మౌలానా, బోడా వెంకన్న, పాపా నాయక్, మొగిలిచర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

**మొదటి పేజీ తరువాయి**

సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, ప్రతి కార్యకర్త కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర పథకాల గురించి గ్రామాల్లో బూత్ స్థాయి ప్రజలకు వివరించాలని మోడీ నాయకత్వంలో జాతీయ భద్రత, ఆర్టికల్ 370, రామ జన్మభూమి వంటి విజయాలు సాధించినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్, బొల్లెపల్లి మహేష్ గౌడ్, మజ్జిగ జైపాల్, పొన్నాల రాజు, ఆడెపు భాస్కర్, గుండెబోయిన నరసింహ గౌడ్, దండు కిషన్, బర్ల నవీన్, నాతి సతీష్, మట్టి రవితేజ, ప్రభాకర్, గువ్వల శేఖర్, రవీందర్ రెడ్డి మరియు క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073